# పాలకులకు రోజులు దగ్గర పడ్డాయి..!

## చమురు ధరలపై భగ్గుమన్న అఖిలపక్షం

కంబాలచెరువు, డిసెంబరు 2 (న్యూస్‌టుడే): పెట్రో ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు మంగళవారం రాజమండ్రిలో భారీ ర్యాలీ చేపట్టాయి. దేవీచౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సబ్‌కలెక్టర్ కార్యాలయం చేరుకొన్న అనంతరం తెదేపా, సి.పి.ఎం., సి.పి.ఐ., నాయకులు ఆందోళననుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు కేంద్ర ప్రభుత్వ విధానాలను తూర్పారపట్టారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల పెరుగుదలను చూపి పెట్రోలు, డీజిల్ ధరలను పెంచిన ప్రభుత్వం అక్కడ తగ్గుదల జరిగినా పెట్రో రేట్లు తగ్గింపునకు ససేమిరా అంటుందని తెదేపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి గోరంట్ల బుచ్చియ్య చౌదరి ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. దేశంలో ప్రజలు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో నానాఇబ్బందులు పడుతున్నారని పెట్రోలు, డీజిల్ రేట్లు తగ్గిస్తే నిత్యావసరాల ధరలు తగ్గుతాయన్నారు. ప్రజల కష్టాలు పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడ్డాయని ప్రజల చేతిలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న వారిని సైతం జైళ్లకు పంపుతున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందని ఆక్షేపించారు. సీపీఐ, సీపీఎం నాయకులు కేతా అప్పారావు, టి.అరుణ్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినా మన పాలకులు పెట్రో రేట్లు తగ్గించకుండా ప్రజలను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి కేంద్రప్రభుత్వం ధరలను తగ్గించే అవకాశం లేదని చెబుతుందని, అయితే ఎన్నికల సమయంలో రేట్లు తగ్గిస్తే చూస్తూ ఊరుకోబోమని భాజపా హెచ్చరిస్తుందని ఆ రెండు పార్టీలకు చిత్తశుద్ధి ఎక్కడుందని వారిద్దరు ఆరోపణలు చేశారు. ధరల స్థిరీకరణకు ప్రత్యేక నిధి కేటాయించాల్సిన అంశంపై ఇప్పుడు మేధావుల నుంచి పలు సూచనలు అందుతున్నాయని ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాలను మట్టి కరిపించాలని ప్రజలకు పిలుపు ఇస్తున్నామన్నారు. పెట్రో ధరల పెరుగుదలపై నిమ్మకు నీరెత్తినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించినందుకే రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని వారు పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గాలంటే పెట్రో ఛార్జీల తగ్గింపు జరగాలని కోరారు. ఇంకా ఆందోళననుద్దేశించి మాజీ శాసనసభ్యులు ప్రభాకర చౌదరి, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి గన్ని కృష్ణ, మహిళా సంఘం నాయకురాలు యడ్ల లక్ష్మి, సీపీఎం నాయకులు టి.ఎస్.ప్రకాష్, తెదేపా నగర మాజీ అధ్యక్షులు ఆదిరెడ్డి అప్పారావు, మాదే విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. ఆందోళనలో గోరంట్ల రాజేంద్రప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలిక శ్రీను, నగరపాలకసంస్థ తెదేపా ఫ్లోర్‌లీడర్ రాచపల్లి ప్రసాద్, వర్రే శ్రీనివాస్, కాశి నవీన్, కార్పొరేటర్లు అజ్జరపు వాసు, కురగంటి సతీష్, రెడ్డి మణి, కప్పల వెలుగుకుమారి, గొర్రెల సురేష్, భాగి ఉమామహేశ్వరరావు, నల్లా రామాంజనేయులుతోపాటు సీపీఐ, సీపీఎం నాయకులు శెట్టి లత్సాలు, సేపేని రమణమ్మ, బి.బి.నాయుడు, పోలిన వెంకటేశ్వర్లు, ఎస్.ఎస్.మూర్తి, భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**జగన్నాథపురం:** అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినందున పెట్రోలు, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆందోళన చేసింది. చమురు ధరలను తగ్గించని కేంద్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ జూన్ నెలలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారల్ ముడిచమురు ధర 123 డాలర్లకు పెరిగిన కారణంగా కేంద్రప్రభుత్వం 8వసారి డీజిల్ లీటరు రూ.3, పెట్రోలు లీటరు రూ.5, వంట గ్యాస్ 5రూపాయలు పెంచిందన్నారు. అంతర్జాతీయంగా బ్యారల్ ముడిచమురు ధర 67 డాలర్లకు తగ్గినా కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు తగ్గించకుండా సామాన్య ప్రజలను దోచుకుంటోందన్నారు. అనంతరం డి.ఆర్.ఒ.కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వనమాడి వెంకటేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, బోళ్ళ కృష్ణమోహన్, దూసర్లపూడి రమణరాజు, పిల్లి సత్తిబాబు, వి.వై.దాసు, చంద్రమౌళి, వామపక్షాల నాయకులు అజయ్ కుమార్, దడాల సుబ్బారావు, మధు, సావిత్ర, వీరబాబు, చంద్రరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

## ప్రతిపక్షాల నోరు నొక్కటం అప్రజాస్వామికం

**కాకినాడ సిటీ:** రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల స్వేచ్ఛను, హక్కులను కాలరాస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ తీవ్రంగా మండిపడింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చినరాజప్ప మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తెదేపా, వామపక్ష, తెరాస నాయకులను అరెస్టు చేయటం అప్రజాస్వామికమని రాజప్ప అన్నారు. అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఎల్లవరం ఎమ్మెల్యే చిన్నం బాబూరమేశ్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటకృష్ణమోహన్ మరొక ప్రకటనలో ఖండించారు.

### రాష్ట్రంలో రాక్షస పాలన

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని జిల్లా పరిషత్ ప్రతిపక్ష నేత రెడ్డి రామకృష్ణ విమర్శించారు. నిరసన తెలుపుతున్న ప్రతిపక్షాలను అరెస్టు చేయటం అక్రమమని ఆయన న్నారు. ప్రతిపక్షాలు, పత్రికల స్వేచ్ఛను అణిచివేస్తున్న ప్రభుత్వంగా రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అపఖ్యాతిని మూటకట్టుకుంటోందని రామకృష్ణ విమర్శించారు.